నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | జూన్ 16, 2024 | www.navatelangana.com

పీఆర్‌టీయూకు రాజీనామా దిశగా ఎస్‌జీటీలు..?



నవతెలంగాణ-ధర్పల్లి

పీఆర్‌టీయూకు ఎస్‌టీజీలు మూకుమ్మడిగా రాజీనామా చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. మండలంలోని పీఆర్‌టీయూలోని ఎస్‌టీలు శనివారం ప్రత్యేకంగా సమావేశమైయ్యారు. పండిట్, పీఈటీ అప్ గ్రేడేషన్ లో అర్హత ఉన్నా ఎస్‌టీలకు చోటు కల్పించకపోవడం, హామీ ఇచ్చిన 10 వేల ప్రాథమిక ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయకపోవడంతో ఎస్‌జీటీలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్టు సమాచారం. సమన్యాయం చేయాల్సిన ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు ప్రత్యేకించి పీఆర్టీయూ ఏకపక్షంగా పండిట్, పీఈటీలకు మద్దతివ్వడంతో చాలా కోపంతో ఉన్నారు. ఇదే విషయంలో జిల్లా వ్యాప్త ఎస్‌జీటీలు ఎమ్మెల్సీలపై తిరుగుబాటు చేస్తున్నారు. ఇది ఎంత వరకు వచ్చిందంటే సంఘ భవనాన్ని నిష్పత్తి ప్రకారం పంచుకునేదాక. తమ సమస్యలను పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తేలా ప్రవర్తిస్తున్న మాతృ సంఘాలకు రాజీనామా చేసే దిశగా ఆలోచిస్తున్నారు. శనివారం ధర్పల్లి ఎస్‌జీటీ ఉపాధ్యాయులు సమావేశమై మరొక ఉద్యమానికి నాంది పలికారు.

సకాలంలో భగీరథ సర్వే పూర్తి చేయాలి: డిఎల్‌పిఓ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

నిర్దేశించిన సమయంలోగా మిషన్ భగీరథ తాగునీటి సర్వేను పూర్తి చేయాలని ఆర్మూర్ డిఎల్‌పిఓ శివరామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని చౌట్‌పల్లిలో కొనసాగుతున్న మిషన్ భగీరథ తాగునీటి సర్వేను ఆయన పరిశీలించారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడిన ఆయన మిషన్ భగీరథ నీరు వస్తుందా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇండ్ల సంఖ్య ఎంత అని పంచాయతీ కార్యదర్శి గంగాజమునను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సీజన్ ఆరంభమైందున ఎప్పటికప్పుడు మురికి కాలువలను శుభ్రం చేయించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ మంచిగా చేయించాలన్నారు. గ్రామంలో ఇంటి పన్నుల డిమాండ్ ఎంత అని కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి పన్నుల వసూళ్లను పెంచాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి సదానంద్, పంచాయతీ కార్యదర్శి గంగాజమున, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జాడేలేని చినుకు

- ముఖం చాటేసిన వరణుడు
- ఖరీఫ్‌సాగుకు రైతన్న ఎదురుచూపు
- కురువని వర్షం.. నిండని చెరువులు
- తొలకరికే పరిమితమైన వర్షం
- వెలవెలపోతున్న చెరువులు, కుంటలు

నవతెలంగాణ-లింగంపేట్/మద్నూర్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 15 రోజులు సమీపిస్తున్నా ఇప్పటివరకు భారీగా వర్షాలు కురిసిన దాఖలాలు లేవు. తొలకరిజల్లులకే రైతులు పరిమితమైపోయారు. చెరువు ఆయకట్టు ప్రాంతాల్లోని రైతులు వర్షం కోసం నిరీక్షిస్తున్నారు. వర్షం కురవకపోవడంతో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, సుక్క నీరు లేక వెలవెలబోతున్నాయి. వృథాగా దర్శనమిస్తున్నాయి.

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 15 రోజులు సమీపిస్తున్నా జూన్ మొదటి వారంలోనే భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తేల్చి చెప్పారు. ఈ మేరకు రైతులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ముందస్తుగానే దుక్కులు దున్ని ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసుకుని బోరుబావుల వద్ద చెరువు ఆయకట్టు ప్రాంతాల్లో రైతులు వరి నారుమల్లు వేశారు. వరి నారుమల్లులో మొలకెత్తిన వరి నాట్లకు సిద్ధంగా ఉన్నాయి. ఆశించిన స్థాయిలో భారీ వర్షాలు కురవకపోవడంతో రైతులు వర్షం కోసం నిరీక్షిస్తున్నారు.

కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా రైతులు వరి పంటను సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 5 లక్షల 14 వేల ఎకరాల్లో పంటలు సాగుతాయి అని అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో ముఖ్యంగా 3 లక్షల 13 వేల 965 ఎకరాలలో వరి పంట సాగు అవుతదని అధికారులు అంటున్నారు. జిల్లాలో నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి, లింగంపేట్, రామారెడ్డి, నిజాంసాగర్, బాన్సువాడ, నసురుల్లాబాద్, బీర్కూర్, మహ్మద్నగర్ మండలాల్లో వరి పంటను అధికంగా రైతులు బోర్ల వద్ద చెరువు ఆయకట్టు ప్రాంతాల్లో నిజాంసాగర్, పోచారం సింగీతం కౌలాస్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో రైతులు వరి పంట సాగు చేయడానికి ఇప్పటికే సన్నద్ధమవుతున్నారు.

తొలకరికే పరిమితం..

ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినప్పటికిని ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో తొలకరి జల్లులకే రైతులు పరిమితమై అయిపోయారు. ముఖ్యంగా ఆరుతడి పంటలు సాగు చేసుకునే రైతులు తొలకరిజల్లులు కురవగానే వ్యవసాయ పనులు నిమగ్నమయ్యారు. జుక్కల్, మద్దూర్, పిట్లం, గాంధారి, తడ్వాయి, సదాశివనగర్ మండలాల్లోని రైతులు ఆరతడి పంటలైన సోయా, మొక్కజొన్న, పత్తి, పెసర, మినుము, పప్పు దినుసుల పంటలు సాగులో నిమగ్నమయ్యారు. ఆర్తోడి పంటలు రైతులకు రోజు ఆకాశం మేఘావృతం కావడం చిరుజల్లులు కురవడం ఆర్తోడి పంటలు వేయడంలో నిమగ్నమవుతున్నారు. వరి పంటల సాగు చేసుకునే రైతులు మాత్రం చెరువులు, కుంటలు, నిడితేనే పంటల సాగు చేస్తామని భారీ వర్షాలకు వస్తేనే పంటలు సాగు చేస్తామని రైతులు భారీ వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

కురవని వర్షం.. నిండని చెరువులు..

జిల్లాలో భారీ వర్షాలు కురవకపోవడంతో చెరువులు కుంటలు వాగులు వంకలు వేలవేలబోతున్నాయి. ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో అన్నదాతలు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా జూన్ 15వ తేదీ వరకు 55.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురువాల్సి ఉండగా కేవలం 46 శాతం వర్షం కురిసింది. 16.7 శాతం తక్కువ కురిసింది. గత సంవత్సరం జూన్ 15 తేదీ వరకు 1114 వర్షం కురవాల్సి ఉండగా కేవలం 996 వర్షపాతం నమోదయింది. అదేవిధంగా జిల్లాలో మద్నూర్, జుక్కల్, కొడపుగల్, బిబిపేట, దోమకొండ, రామారెడ్డి, బాన్సువాడ, నస్రుల్లాబాద్, సదాశివనగర్, గాంధారి మండలాల్లో వర్షపాతం తక్కువగా నమోదయింది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు ఆరుతడి పంటలు రైతులు వేస్తున్నారు. జిల్లాలో నిజాంసాగర్, పోచారం, సింగీతం కౌలాస్నాల ప్రాజెక్టుల్లో ఆయకట్టు రైతులు పంటలు సాగు చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రాజెక్టుల్లో నీళ్లు లేకపోవడంతో పోచారం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేయడంతో ఎల్లారెడ్డి మండలాల రైతులు పోచారం ప్రాజెక్టుపై ఆధారపడి వరి పంట సాగు చేస్తారు. ఇప్పటివరకు పెద్ద వర్షాలు కురిసే తప్ప ప్రాజెక్టు నిండే పరిస్థితి లేదు. జిల్లా వ్యాప్తంగా 2500పైగా చెరువులు కుంటలు ఉన్నాయి. ముఖ్యంగా ఎల్లారెడ్డి నియోజకవర్గం ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్, గాంధారి, రామారెడ్డి, సదాశివ నగర్, రాజంపేట్ ఇతర మండలలో నియోజకవర్గంలో 1230పైగా చెరువులు కుంటలు ఉన్నాయి. ప్రస్తుతం చెరువుల కుంటల్లో నీళ్ల లేక వేలవెలబోతున్నాయి. యాసంగిలో ఎండలు తీవ్రం కావడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోవడంతో చెరువు కుంటల్లో పశువుల దాహం తీర్చడానికి నీళ్లు ఉన్నాయి. మరికొన్ని చెరువులునీళ్ల లేక వెలవెలబోతున్నాయి. లింగంపేట పెద్దవాగుపై ఆధారపడి లింగంపేట్, గాంధారి, నాగిరెడ్డి, మండలాలకు పోచారం ప్రాజెక్టుకు ప్రధాన గుండెకాయ అయినా పెద్ద వాగులో పశువులకు సైతం తాగునీరు లేకుండా పోయాయి. రాళ్లతో వృథాగా దర్శనమిస్తుంది. పెద్ద వాగుపై ఆధారపడి 35 వేల ఎకరాలపైగా వరి పంటలు సాగు చేస్తారు. పెద్ద వాగులో నీళు లేక వెలవెలబోతుంది. దీంతో ఆయా కట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.



వర్షాలు పడక ఎండిపోయిన వాగు



ఎండిపోయిన కాలువ

46 వేల ఎకరాలు సాగుకు సిద్ధం

మద్నూర్ : వానకాలం పంట సాగు కోసం వర్షాలు ముఖం చాటేయడంతో జూన్ మాసం రెండో వారం ముగియడంతో అన్నదాతలంతా ఆందోళన చెందుతున్నారు. ప్రతి సంవత్సరం జూన్ మాసం వచ్చింది అంటే రైతన్నకు వానాకాలం పంట సాగు ప్రారంభమైనట్లే, జూన్ మొదటి వారంలో వర్షాలు కురియాలి కాని రెండో వారం ముగుస్తున్న పడకపోవడం రైతన్నలంతా ఆందోళన వ్యక్తం చేసుకుంటున్నారు. ఈ ఏడాది వానాకాలం పంట సాగు కోసం ఉమ్మడి మండలంలో రైతన్నలంతా కావలసిన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుని రెడీగా ఉన్నారు. ప్రతిరోజు రైతన్నలు వర్షాల కోసం ఎదురు చూపులు. ఆకాశమంత నల్లటి మబ్బులతో వర్షం పడుతుందని అనుకుంటే నల్లటి మబ్బులు ఎక్కడికి పారిపోతుందో అర్థం కాని పరిస్థితి. ఈరోజుల్లో టెక్నాలజీ పెరిగిపోయింది. ప్రతి ఒక్కరూ తమ తమ ఫోన్‌లోనే వెదర్ గురించి చూసుకుంటున్నారు. ఉమ్మడి మండలంలో వ్యవసాయ శాఖ అధికారుల నివేదికలను బట్టి చూస్తుంటే ఈ ఉమ్మడి మండలంలో వానాకాలం పంట సాగు 46 వేల ఎకరాలు సాగుకు రైతన్న సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. వీటికి కావలసిన విత్తనాలు, ఎరువులు లక్షలాది రూపాయలు వెక్కించుకొని రైతన్న సాగుకు సిద్ధం అయినప్పటికీ వర్షాకాలం ముఖం చాటేస్తోంది. ఇటీవల మండల కేంద్రంలో గ్రామానికి నడి ఒడ్డున గల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, గ్రామదేవతలకు శిలాభిషేకం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగింది. అన్ని సిద్ధం చేసుకున్న కావలసిన వర్షాలు పడకపోవడం రైతన్నలకు ఆందోళన కలిగిస్తుంది. జూన్ మాసం రెండో వారం ముగిసిన ఈ నెలాఖరు వరకు వానాకాలం పంట సాగుకు అనుకూలమేనని వ్యవసాయ అధికారుల అంచనాలు తెలుపుతున్నాయి. రైతన్నలు జూన్ మొదటి వారంలో సాగు అవుతే పంటలు బాగా పండుతాయని రబ్బీ పంట సాగు కోసం వానాకాలం పంట సమయానికి చేతికి వస్తుందని రైతన్నల ఆశా, రైతన్నల ఆశను ఏడాది వర్షం ముఖం చాటేస్తుంది.

వానాకాలం పంట సాగు కోసం వర్షం తిప్పలు ఇలా ఉంటే ఇక రబ్బీ పంట సాగుకు వర్షాకాలం ఏ విధంగా అనుకూలిస్తాయని ఆందోళన రైతన్నలు వ్యక్తం అవుతుంది. ప్రతి గ్రామంలో రైతన్న వర్షం పడటానికి అన్నదానాలు చేపట్టడానికి సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. వరుణుడు కరుణించాలని కోరుకుంటున్నారు. ముఖం చాటేసిన వర్షాలు రైతన్న ఎదురు చూపులకు తెరదించేందుకు వెంటనే ఒకటి రెండు రోజుల్లో కావలసిన వర్షం పడాలని రైతన్న కండ్లల్లో ఆనందాన్ని కలిగించాలని కోరుకుంటున్నారు. ఒకటి రెండు రోజుల్లో వర్షాలు పడతాయా లేదా అనేది రైతన్నలు ఎదురు చూస్తున్నారు.

మోడీ అహంకారం తిరస్కరణ

- రాజ్యాంగానికి, ప్రజాస్వామిక విలువలకు పట్టం
- ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ఎమ్‌డి అబ్బాస్

నవతెలంగాణ-నిజామాబాద్

బిజెపి నియంతృత్వ, మతోన్మాద పోకడలను, మోడీ అహంకారాన్ని పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారని, రాజ్యాంగానికి, ప్రజాస్వామిక విలువలకు పట్టం కట్టారని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ఎండి అబ్బాస్ అన్నారు. మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో రామ్మోహన్ రావు అధ్యక్షతన 'పార్లమెంటు ఎన్నికలు - పరిశీలన' అంశంపై శనివారం ట్రస్ట్ భవనంలో చర్చా గోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి పెద్ద ఎదురుదెబ్బ తగిలిందని, 400 సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మార్చాలని చూసిన బిజెపి కి 240 సీట్లు మాత్రమే ఇచ్చి ప్రజలు ముకుతాడు వేశారని అన్నారు. ప్రజల దైనందిన జీవిత సమస్యలు పరిష్కారం చేయడంలో విఫలం చెందిన బిజెపి మత విద్వేషాలు రెచ్చగొట్టి మరోసారి విజయం సాధించాలని చూసిందని దీనిని ప్రజలు తిరస్కరించారని ఆయన అన్నారు. విభిన్న సంస్కృతుల నిలయమైన దేశాన్ని ఏక సంస్కృతి లోకి కుదించాలనే బిజెపి ప్రయత్నాన్ని ప్రజలు ప్రతిఘటించారని, వైవిధ్యమే మన దేశ బలమని, దానినే ప్రజలు కాపాడుకోవడం కోసం కృషి చేశారని అన్నారు. అయితే ప్రమాదం తొలగిపోలేదని మరింత పట్టుదలతో నియంతృత్వ, మతోన్మాద పోకడలకు వ్యతిరేకంగా నిలబడి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో హుస్సేన్, ఈ వి ఎల్ నారాయణ, చంద్రశేఖర్, రాధా కిషన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ఎమ్‌డి అబ్బాస్

అధికారుల నిర్లక్ష్యంతో పథకాలు అందట్లే



ధర్నా చేపట్టి మాట్లాడుతున్న నాయకులు

- ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ధర్నా

నవతెలంగాణ-జుక్కల్

అధికారుల నిర్లక్ష్యంతో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని విమర్శిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జుక్కల్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రంజిత్ కూమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు సురేశ్‌గొండ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో గృహలక్ష్మీ, గృహజ్యోతి పథకాలు అర్హులైన వేలాది కుటుంబాలకు అధికారుల నిర్లక్ష్యంతో అందడం లేదని అన్నారు. గృహజ్యోతి పథకం కొందరికేనా అని ప్రశ్నించారు. గృహజ్యోతి అమలులో అధికారుల నిర్లక్ష్యం వలన ఒక జుక్కల్ మండల కేంద్రంలో 300 కుటుంబాలకు ఆన్‌లైన్ రికార్డులు లేదని దీనితో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ఆరు గ్యారెంటీలలో గృహజ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్క కుటుంబానికి సంవత్సరానికి 12 వేల రూపాయలు నేటికీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. నెలలు గడుస్తున్న పేద ప్రజలు సంక్షేమ పథకాల కోసం ఎదురు చూసే పరిస్థితి దాపురించిందన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎస్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ అధికారుల ఒత్తిడి దౌర్జన్యాలు పెరిగాయని ఆయన మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యం ఉంచుకొని ఆన్‌లైన్‌లో అప్లై చేయక లబ్ధిదారులను వేధించడం సరైనది కాదన్నారు. మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామంలో ఆన్‌లైన్ అప్లై లేని వారి పేర్లలిస్టు తీసుకుని ఆన్‌లైన్ చేసి జీరో బిల్ వచ్చే విధంగా కృషి చేయాలని విద్యుత్ అధికారులకు సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు షేక్ ఫిర్దోస్, షేక్‌ఫారుక్, లబ్ధిదారులు, లక్ష్మణ్, గుండు పటేల్, సాయవ్వ నారాయణ, తదితర లబ్ధిదారులు పాల్గొన్నారు.

కామారెడ్డి కలెక్టర్ బదిలీ

- కొత్త కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి



ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జిలాకు నూతన కలెక్టర్‌గా 2016వ బ్యాచ్‌కు చెందిన ఆశీష్ సంగ్వాన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న జితేష్ వి పాటిల్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా బదిలీ చేశారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లా కలెక్టర్ పనిచేస్తున్న సంగ్వాన్ స్వస్థలం హర్యానా రాష్ట్రంలోని భివాని. అమెరికాలోని జార్జియా టెక్ యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ లో మాస్టర్ డిగ్రీ చేసిన అనంతరం 2015లో జరిగిన సివిల్ సర్వీ సెస్ పరీక్షలో 12వ రాంక్ సాధించారు. అక్టోబర్ 2023 నుం డి నిర్మల్ కలెక్టర్ గా పనిచేస్తున్న సంగ్వాన్ ను కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా నియమించారు. వీరి భార్య కూడా 2016 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ క్రాంతి వల్లూరు ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఒక పాప.

పాలనలో తనదైన మార్క్‌చూపిన జితేశ్ వి.పాటిల్



2021వ సంవత్సరం ఆగస్టు 31న కామారెడ్డి కలెక్టర్‌గా జితేశ్ వి పాటిల్ బదిలీపై వచ్చారు. అంతకు ముందు నిజామాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిం చారు. కలెక్టర్‌గా వచ్చినప్పటి నుంచి జితేశ్ వి పాటిల్ విధుల్లో తనదైన ముద్ర వేశారు. ఉన్నతాధికారుల ఆదే శాలు పాటిస్తూ అధికార యంత్రాంగంతో పనులు చేపట్టారు. అటు అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఇటు పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా విజయవం తంగా నిర్వహించడంలో తనదైన మార్క్ చూపించారు. అదే విధంగా జిల్లాలో పర్యాటక రంగానికి ఊతమిచ్చేందుకు ప్రాచీన కట్టడాల పరిరక్షణ, అభివృద్ధికి కృషి చేశారు. లింగంపేట్‌లోని మెట్లబావి ని పలుమార్లు సందర్శించి దాని సుందరీకరణ పనులు చేపట్టడంలో ప్రత్యేక చొరవ కనబరిచారు. స్థానికులతో పాటు దాతలను భాగస్వాములు చేసి పనులు ప్రారంభించారు.

పెరిగిన టమాటా, ఉల్లి ధరలు

- కొనాలంటే జంకుతున్న సామాన్యులు

నవతెలంగాణ-జుక్కల్

టమాటా, ఉల్లి ధరలు భారీగా పెరిగాయి. గతంలో రూ.20 కిలో లభించే టమాటా ప్రస్తుతం రూ.80 నుంచి 100 పలుకుతోంది. ఇక ఉల్లి గతంలో రూ.20 కే లభించగా ప్రస్తుతం రూ.50 పలుకుతోంది. మండలంలోని కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు, టమాటా, ఉల్లి ధరలు పెరగడంతో సామాన్యులకు టమాటా ఇక కరువే అన్నట్టుగా ధర ఆకాశాన్ని అంటింది. ప్రస్తుతం కూరగాయలు కొనలేక తినలేక పోతున్నామని మధ్యతరగతి కుటుంబాల వారు అంటున్నారు. ఇలాగైతే కూరగాయలకు బైబై చెప్పేసి ప్రస్తుతం పప్పుల కూరనే వాడుకుంటాన్నామని మార్కెట్‌లో మహిళలు మాట్లాడుకుంటున్న పరిస్థితి నెలకొంది. దీంతో పాటు ఉల్లి ధర ఘాటెక్కింది. కిలో ఉల్లిగడ్డ ప్రస్తుతం యాభై రూపాయలకు కేజీ, వంకాయ నలుపై, బెండకాయ అరువై, పచ్చిమిర్చి ఎనభై, ఆకు కూరలు కూడా పెరగడం ప్రస్తుతం ధరలుపై విధంగా పలుకుతోంది. ప్రభుత్వం తమాట, ఉల్లి, కూరగాయల ధరలను అదుపుచేసి నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.



పొంచి ఉన్న ప్రమాదం

- స్కూల్ పక్కనే ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం
- ఇనుప చువ్వలు బయటపడి వంగిన వైనం

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని నందిగాం ఉన్నత పాఠశాల పక్కనే విద్యుత్ స్తంభం ఇనుప చువ్వలు బయటపడి వంగడంతో ప్రమాదకరంగా మారింది. పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి 8వ తరగతి వరకు 123 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల పక్కనే ఇనుప చువ్వలు బయటపడి 11 కెవి వైర్లతో కలిపిన విద్యుత్ స్తంభం ఉండడం, వర్షాకాలం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ఏ రూపంలో పొంచి వస్తుందేమోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. కాబట్టి విద్యుత్ అధికారులు స్పందించి కొత్త స్తంభాన్ని అమర్చి ఎటువంటి ప్రమాదం జరగక ముందే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



స్కూల్ ముందు ప్రమాదకరంగా వంగిన విద్యుత్ స్తంభం

నవతెలంగాణ
నిజామాబాద్
ఆదివారం | జూన్ 16, 2024 | www.navatelangana.com

చెట్ల కొమ్మల తొలగింపు

నవతెలంగాణ -మోపాల్

మండలంలోని తానకుర్తి శివారులో శనివారం ఏఈ బాబా శ్రీనివాస్ ఆధ్వర్యంలో వర్షాకాలం సమీపిస్తున్న వేళ రోడ్లపై ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు ఎలక్ట్రికల్ వైర్లకు తగలడం వల్ల కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుండటంతో సమస్యను అధిగమించేందుకు గానూ చెట్ల కొమ్మలను నరికి వేస్తున్నామని ఏఈ బాబా శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ ఉత్తమ్ జాడే తదితరులు పాల్గొన్నారు.



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

నత్తనడకన బ్రిడ్జి పనులు



పూర్తికాని బ్రిడ్జీ పనులు

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని కొల్లూరు - బోధన్ రహదారిపై కొల్లూరు గ్రామ సమీపాన గల బ్రిడ్జి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. గతంలో రహదారిపై చిన్న బ్రిడ్జీ ఉండగా.. అది శిథిలావస్థకు చేరడంతో నూతనంగా నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. చుట్టు పక్కలకు వెళ్లేందుకు, బోధన్‌కు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం కల్దుర్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించి గత మే నెలలో ఉద్యోగ విరమణ పొందిన సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు చెల్లా శ్రీనివాస్‌రెడ్డికి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు సుజాతకు, పాఠశాల ఉపాధ్యాయులు శనివారం శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బోధన్ మండల విద్యాధికారి నాగనాథ్, మండల నోడల్ అధికారి నాగయ్య, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగయ్య, ఉపాధ్యాయ నాయకులు అంబెల్లి శంకర్, ధనరాజ్, సాయిలు, శ్రీనివాస్, అబ్బయ్య, సంజీవ్, విశ్రాంత ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ శరత్, ఎంపీటీసీ లక్ష్మిరాజన్న, మాజీ సర్పంచ్ ప్రకాష్ పటేల్, గంగాధర్, అశోక్ సీఆర్పీలు విజయ్, బాబు, అరవింద్ పాల్గొన్నారు.

నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్' కు ముప్కాల్ విద్యార్థుల ఎంపిక





నవతెలంగాణ-ముప్కాల్

'నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్' కు ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం శనివారం రోజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న పాఠశాల విద్యార్థులు పి.సుశాంత్, బి.స్వరూప, ఎ.నిత్యశ్రీ, డి.వైష్ణవి, జి.నందుశ్రీ ఐదుగురు విద్యార్థులు 'నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్' కి ఎంపిక అయ్యారని అన్నారు. ఎంపికైన విద్యార్థులకు 4 సంవత్సరాల కాలం పాటు సంవత్సరానికి రూ.12 వేల రూపాయల చొప్పున కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ చూపి ఎంపికైన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలను పెంచాలి

- జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న డీఈవో

నవతెలంగాణ-నందిపేట్

ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలను మరింత పెంచాలని జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలను జిల్లా విద్యార్థికారి దుర్గాప్రసాద్ సందర్శించారు. పాఠశాలలో అడ్మిషన్ ఎంతవరకు అయ్యాయో స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నిర్వహణ, డిజిటల్ తరగతులు తదితర విషయాలపై సమీక్షించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఎంఓ శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఆరోగ్యాశాఖ మంత్రి దామోదర రాజానర్సింహాను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా కలిశారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస మౌలిక సౌకర్యాలు లేవని, వివిధ విభాగల్లో సరిపడా వైద్యులు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అత్యవసర సమయంలో రోగులు జిల్లా సివిల్ ఆసుపత్రిలో సరైన మౌలిక సౌకర్యాలు, వైద్యులు లేక హైదరాబాద్‌కు రావాల్సిన పరిస్థితి ఉందని, తక్షణమే జనరల్ ఆసుపత్రిలో ప్రజలకు అన్ని మౌలిక వసతులు కల్పించి, వివిధ విభాగాల్లో వెంటనే వైద్యులను నియమించాలని, అలాగే ఆసుపత్రి అభివృద్ధికి సరిపడా నిధులు కూడా విడుదల చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆయనే నాన్న



- పిల్లలకు మార్గదర్శకుడు..
- బిడ్డలకోసం సర్వ త్యాగి
- నేడు ఫాదర్స్ డే

నవతెలంగాణ-ఆర్మూర్

వేలు పట్టి నడిపించేది తానే.. జీవితానికి వెలుగులు పంచేది తానే.. తొలి అడుగు నుంచి తోడుగా నిలిచేది ఆయనే.. పాలన నుంచి అన్ని బాధ్యతలు చూసేది తానే.. ఆయనే నాన్న. అమ్మ కడుపులో పెట్టుకుంటే అతడు గుండెల్లో పెట్టుకుంటాడు. అమ్మ అనురాగం చూపితే నాన్న మమకారం పంచుతాడు. బిడ్డల బాగు కోసం సర్వస్వం త్యాగం చేస్తాడు. పిల్లల భవిష్యత్తు కోసం జీవితాన్ని ధారబోస్తాడు. కొవ్వొత్తుల కరుగుతూ పిల్లల ఎదుగుదలకు వెలుగుల బాట వేస్తాడు. అందుకే నాన్నంటే నడిచే దైవం.. పిల్లల అభివృద్ధిలో నాన్న పాత్ర ఎంతో కీలకమైనది. ఉన్నతమైనది. తండ్రి స్ఫూర్తితో ఆయన చూపిన బాటలో నడిచి ఎందరో ఉన్నత స్థానానికి ఎదిగారు. కన్నవారి కలల్ని సాకారం చేశారు. నేడు ఇంటర్నేషనల్ ఫాదర్స్ డే సందర్భంగా నవతెలంగాణ కథనం..

కుటుంబ వ్యవస్థలో తండ్రి స్థానం..

ప్రాచీన కాలం నుంచి నేటి ఆధునిక సమాజం వరకు తండ్రి కుటుంబ పోషకుడే కాదు రక్షకుడు కూడా. అమ్మ ఒడి గుడి అయితే నాన్న భుజం. లోకాన్ని చూపే బడి. కుటుంబ వ్యవస్థలో తండ్రి స్థానం విశిష్టమైనది. బాల్య దశలో తండ్రికి పిల్లలతో విడదీయరాని బంధం ఉంటుంది. పిల్లలతో ఆడుకుంటూ వారిలో అక్షరాలు దిద్దితో ఈ దశలోనే ఎక్కువగా ఆనందిస్తారు. తప్పు చేసినప్పుడు దండించడం కన్నా మంచి చేసినప్పుడు గుర్తించి మెచ్చుకొని ప్రోత్సహిస్తే ఆ బిడ్డకు తండ్రితో అనుబంధం మరింత పెరుగుతుందని మానసిక నిపుణులు చెబుతారు. పిల్లలకు ప్రేమ ఆప్యాయతలను ఇవ్వడం పుచ్చుకోవడం నేర్పించాలని వారు అంటారు. పిల్లలను నియంత్రించే ప్రయత్నం చేయడం వల్ల తండ్రి దేన్ని నియంత్రిస్తారో దాన్నే వారు ఇష్టపడతారు. అందుకే వారికి ఏది మంచో ఏది చెడో అర్థం చేయించే ప్రయత్నం చేయాలి. ఏదో ఒక సందర్భంలో పిల్లల ప్రవర్తన ఇబ్బందిని కోపాన్ని తెప్పిస్తుంటాయి. ఇలాంటి సందర్భాలలో కోపాన్ని, విసుగును తగ్గించుకొని పిల్లల మనసును అర్థం చేసుకోవాలి. నిదానంగా మాట్లాడితే అర్థం చేసుకుంటారు. ఒత్తిడి ఒడిదొడుకుల కౌమారంలో మనసులో ఉంచుకోలేక బయట పడలేక సతమతమయ్యే పరిస్థితి. అనేక సందేహాలు, సంశయాలు ఆ కౌమారం దశలో ఎదురయ్యే పరిస్థితి. ఈ దశలో మానసికంగా ఉత్సాహపరిచి ప్రోత్సహించడం అత్యంత అవసరం. సినిమాలు, షికార్లు, చెడు వ్యసనాలు దరికి రానీయకుండా వారిని ఓకంటా కనిపెట్టుకొని ఉండాలి. క్రీడలు, వ్యాయామం, చదువు, విజ్ఞానం వంటి వాటివైపు మళ్లెట్టు చూడాలి. కేర్‌కు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించి దారి చూపాలి. ఈ వయసులో కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగిన వారి గురించి చెప్పడం ద్వారా తాము కూడా అలా ఎందుకు కాకూడదనే భావన వారిలో కలిగించిన వారవుతారు.

యవ్వనంలో స్నేహితుడిగా..

జీవితంలో స్థిరమైన ఆలోచనలో దిశగా పయనించే యవ్వన దశలో కుటుంబం తదితర బాధ్యతల విషయంలో తండ్రి మార్గదర్శిగా నిలుస్తాడు. కుటుంబ బాధ్యతలు సంపాదన పోషణ జీవిత భాగస్వామి ఎంపిక చేపట్టే బాధ్యతలపై సమాజంలో సత్సం బంధాలు నెలకొ ల్పేందుకు ఎలా సాగాలో తగిన సూచనలు ఇవ్వాలి. తప్పటడుగులు పడిన ఒడిదుడుకులు ఎదురైనా మానసికంగా ఆరోగ్యపరంగా సమస్యలు వచ్చినా.. చెదిరిపోని దృఢత్వాన్ని వారికి వివరిస్తూ ఉండాలి. ఆధునిక సమాజంలో పిల్లలు కొత్త కొత్త విషయాలను నేర్చుకుంటున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా తండ్రులు మారుతున్నారు.

రోల్ మోడల్‌గా ఉండాలి



తండ్రి అంటే పిల్లలకు రోల్ మోడల్‌గా ఉండాలి. ప్రతీ తండ్రికి ఒక బాధ్యత ఉంటుంది. పిల్లల మనోభావాలు ఇష్ట కష్టాలను మనస్తత్వాన్ని గుర్తించాలి. పిల్లలను క్రమశిక్షణలో ఉంచి చదివిస్తే వారి భవిష్యత్తు ఎంతో ఉన్నతంగా ఉంటుంది.

- మాడవేడి పద్మావతి, ఉపాధ్యాయురాలు, గోవింద్‌పేట్.

గోరంత సాయం.. కొండంత ధైర్యం..



పైడి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి అనారోగ్యంతో మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ఆర్థిక సహాయాన్ని అందించి అండగా ఉంటామని భరోసా ఇస్తున్నాం. ఎంతో కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగిన మా నాన్న ఇచ్చే ప్రోత్సాహంతో ముందుకు వెళుతున్నాను. కుటుంబ సభ్యుల పాత్ర మర్చిపోలేను.

- పైడి సుచరిత రెడ్డి, నైన్‌స్టార్ మేనేజింగ్ డైరెక్టర్, అంకాపూర్.

ఇటుక బట్టీలకు మట్టి

- అక్రమంగా తరలింపు
- పట్టించుకోని అధికారులు



మట్టిని తవ్వి.. జేసీబీతో లోడింగ్



టిప్పర్లలో మట్టి తరలింపు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని న్యాల్కల్ గ్రామంలో గల మాసాని చెరువులోని నల్ల మట్టిని నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కుల రాత్రి, పగలు తేడా లేకుండా ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నారు. కొందరి నాయకులు అండదండలతోనే ఇదంతా కొనసాగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

మోపాల్ మండల కేంద్ర శివారులో దాదాపు 15 వరకు ఇటుక బట్టీలున్నాయి. బట్టీ నిర్వాహకులు నల్ల మట్టిని ప్రతి వేసవిలో చెరువుల్లో నుంచి తరలించి ఏడాదికి సరిపడా నిలువ చేసుకుంటున్నారు. రోజుకి మూడు నుంచి నాలుగు టిప్పర్లు, ఐదు ఆరు ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్ ధర రూ.3500 వరకు ఉంటుంది. పెద్ద పెద్ద జెసిబిల సహాయంతో రాత్రి పగలు తేడా లేకుండా మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఈ విషయాన్ని నవతెలంగాణ తహసీల్దార్ రామేశ్వర్ దృష్టికి తీసుకెళ్లగా.. అక్రమంగా మట్టిని తరలించేవారాపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు

వివాహిత ఆత్మహత్య



నవతెలంగాణ-మోపాల్

వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని కంజర్ గ్రామంలో చోటుచేసుకుంది. మోపాల్ ఎస్ఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వర్ష (40)కు అదే గ్రామానికి చెందిన గోవర్ధన్ అనే వ్యక్తితో 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి తరచుగా భార్యాభర్తలకు గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో మనస్థాపం చెందిన వర్ష వ్యవసాయ నిమిత్తం తీసుకువచ్చిన పురుగుమందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అది గమనించిన కుటుంబీకులు హుటాహుటినా నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతిచెందింది. మృతురాలికి ముగ్గురు పిల్లలున్నారు. పోలీసులు భర్తపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి నల్లను చెరిపేశారు

- చేయించాలని అడిగితే అహంకార ధోరణి

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని చల్లగర్గ గ్రామంలోని మట్టెల రమేష్ అనే చెవిటి వ్యక్తి కుటుంబానికి గత 5 నెలలుగా తాగునీరు నల్ల ద్వారా రాకుండా చెడిపేశారు. గత 5 నెలలుగా తమ గ్రామంలోని రోడ్డుపై తమ ఇంటిముందు గ్రామాభివృద్ధిలో భాగంగా గ్రామపంచాయతీ అధికారుల ఆదేశంతో ఓ కాంట్రాక్టర్ కంకర వేసుకుని, వాటిని తొలగించేందుకు జెసిబి ద్వారా కంకర తొలగించే సందర్భంలో మట్టెల రమేష్ ఇంటికి సరఫరా అయ్యే తాగునీటి నల్లపైపు చెడిపోయింది. ఆ విషయంలో సంబంధిత గ్రామ కార్యదర్శి తాను చేపిస్తానని చెప్పి చేతులు దులుపుకున్నట్టు బాధితులు తెలిపారు. ఈ విషయమై కార్యదర్శికి గత 5 నెలలుగా ప్రాధేయపడుతున్నప్పటికీ ఆయన కనికరించడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నెమ్మదిగా పనులు.. చదువుకు ఇబ్బందులు



కొనసాగుతున్న పనులు



ఓ ఇంటి వద్ద ఆవరణలో బోధన

- అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తికాక విద్యార్థులకు సమస్యలు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని న్యాల్కల్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల మరమ్మతులు, విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కింద దాదాపు రూ.11 లక్షలు నిధులు మంజూరయ్యాయి. అందులో భాగంగా పనులు ప్రారంభమయ్యాయి. కానీ పనులు నత్తనడకన చేపడుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. స్కూళ్లో పనులు చేపడుతుండటంతో రోడ్డు పక్కన ఓ ప్రయివేటు వ్యక్తుల ఇంటి ఆరు బయట చదువు చెప్పాల్సి వస్తోంది. ఇప్పటికైనా పంచాయతీరాజ్ అధికారులు, మండల విద్యాధికారి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పనులు త్వరగా పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ముస్సిపల్ వాహనాల రిపేర్ కోసం షెడ్ నిర్మాణం

- పనులను ప్రారంభించిన మేయర్



పనులను ప్రారంభిస్తున్న మేయర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నగరంలోని ఖిల్లా ఫిల్టర్ బెడ్ ప్రాంతంలో మున్సిపల్ వాహనాల మరమ్మతుల కోసం షెడ్ నిర్మాణానికి నగర మేయర్ దండు నీతూ కిరణ్ మున్సిపల్ కమిషనర్‌తో కలిసి శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ దండు నీతూ కిరణ్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ వాహనాల నిర్వహణ కోసం అవసరమైన చిన్న చిన్న రిపేర్లు చేసేందుకు రూ.43లక్షల నిధులతో షెడ్ నిర్మాణం చేయనున్నట్టు తెలిపారు. రోజువారీ చెత్త తరలింపు చేసే వాహనాలు, నీటి సరఫరా వాహనాలకు ఏదైనా రిపేర్లు వస్తే షోరూమ్‌లలో చేయించటం ద్వారా సమయం వృథా కావటమే కాకుండా నగరంలో చెత్త నిర్వహణపై ప్రభావం పడుతున్నందున చిన్న చిన్న రిపేర్లు చేయుటకు వీలుగా షెడ్ నిర్మాణం చేస్తున్నామని అన్నారు. పనుల్లో జాప్యం జరగకుండా ఉండేందుకు తీసుకోవలసిన అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఇల్లందుల మమత, మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ ఆనంద్ సాగర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఇనాయత్ కరీం తదితరులు పాల్గొన్నారు.

18న ద్విచక్ర వాహనాల బహిరంగ వేలం

నవతెలంగాణ-నిజామాబాద్

డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ నిజామాబాద్ ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా అధికారి నిజామాబాద్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో 18-06-2024 మంగళవారం ఉదయం 10గంటలకు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ నిజామాబాద్‌లో వివిధ ఎక్సైజ్ నేరాలలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను బహిరంగ వేలం వేస్తున్నట్టు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ వేలానికి సంబంధించిన వివరాలకై ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ నిజామాబాద్ (బోర్గాం పాంగ్ర)లో సంప్రదించాలని తెలియజేశారు. కావున ఆసక్తి గలవారు డిపాజిట్లు చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వైద్యం, విద్యతోనే అభివృద్ధి

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

నిత్యం ప్రజలకు వైద్యం తో పాటు మెరుగైన విద్యను అందించడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని శనివారం జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం వైద్య, విద్యను పట్టించుకున్న పాపాన పోలేదని, పేద ప్రజలకు ఉన్నత విద్య అందడం, అందని ద్రాక్షగా మారిందని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఒకరికి విద్య అందించడమే లక్ష్యంగా, ఒక ఉపాధ్యాయుడు ఉన్న బడులను కూడా తెరిపించాలని ఆదేశించడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. పాఠశాల ప్రారంభం రోజే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేసిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులను, విద్యార్థి తల్లిదండ్రులను నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని, ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధికి కృషి చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడైనా పేద ప్రజల పక్షాన నిలబడుతుంది పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
3
ఆదివారం | జూన్ 16, 2024 | www.navatelangana.com

ఎస్సీ వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా ఎస్సి అభివృద్ధి అధికారి రజిత

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లాలోని ఎస్సి వసతి గృహాలలో 1వ తరగతి నుంచి 10 వ తరగతి ప్రీమెట్రిక్, ఇంటర్ నుండి పిజి, బి.ఎడ్ వరకు పోస్టుమెట్రిక్ తరగతుల విద్యార్థుల ప్రవేశాలకై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఎస్సి అభివృద్ధి అధికారి రజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వసతి గృహంలో ప్రవేశానికి విద్యార్థుల స్వగ్రామం 5 కిలో మీటర్ల పై బడి దూరం ఉన్న వారికే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. అర్హత ఉండి వసతి గృహాలలో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు తమ పాఠశాల, కళాశాల దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఎస్సి వసతి గృహ సంక్షేమాధికారి నుండి దరఖాస్తు ఫారాలు పొంది పూర్తి చేసిన దరఖాస్తు తో పాటు బోనఫైడ్, కుల,ఆదాయ ధ్రువీకరణ, ఆధార్ కార్డు, 2 పాస్ పోర్టు సైజ్ ఫోటోలు జతపరచి ఈ నెల 30 లోగా సమర్పించాలని సూచించారు. వసతి గృహ సౌకర్యాలు, ఇతర వివరాలకు వసతి గృహ సంక్షేమాధికారిని సంప్రదించవలసినదిగా రజిత పేర్కొన్నారు.

దీర్ఘకాలిక రుణాలు చెల్లించాల్సిందే

- రైతులు ఓటీఎస్ పథకాన్ని వినియోగించుకోవాలి
- ఎన్‌డీసీసీ బ్యాంక్ ఉమ్మడి జిల్లా మేనేజర్ సర్య ప్రకాష్
- నిబంధనల ప్రకారమే పొలంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్టు వెల్లడి

నవతెలంగాణ-లింగంపేట్

సహకార బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వినియోగ దారులు, రైతులు ఓటీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా సహకార బ్యాంకు జనరల్ మేనేజర్ సూర్యప్రకాశ్ కోరారు. దీర్ఘకాలిక రుణాలు కట్టాల్సిందే అని స్పష్టం చేశారు. శనివారం మండల కేంద్రంలోని సహకార బ్యాంకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని ఏ జిల్లాలో లేని విధంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఓటీఎస్ విధానం గత రెండు సంవత్సరాలుగా కొనసాగిస్తున్నట్లు ఆయన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్

తెలిపారు. ఈ పథకాన్ని సద్విని చేసుకోవాలన్నారు. దీర్ఘకాలిక రుణాలు కట్టి తీరాల్సిందే అని స్పష్టం చేశారు. ఓటీఎస్ పథకం ఈ నెల 30వ తేదిన ముగుస్తుందని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఓటీఎస్ కొనసాగించడం వల్ల జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు 20 కోట్ల రూపాయలు నష్టం ఏర్పడిందన్నారు. జిల్లాలో 230 కోట్ల రూపాయలు బకాయిలు ఉండగా వంద కోట్ల రూపాయలు వసూలు చేశామన్నారు. ఇంకా 130 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా లింగంపేట్ మండలంలో 14కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిలు వసూలు కాని కారణంగా నూతనంగా రైతులకు రుణాలు అందించలేకపోతున్నట్లు తెలిపారు. అంతే కాకుండా బ్యాంకుల్లో డిపాజిట్‌దారులకు సైతం డబ్బులు చెల్లించడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. బకాయిలు పేరుకుపోయిన కారణంగా వసూలు కోసం ఇబ్బంది పెట్టాల్సి వస్తుందన్నారు. రైతులు తీసుకున్న రుణాల వసూలు కోసం నిబంధనల ప్రకారం వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

పోల్కంపేట గ్రామానికి చెందిన రైతు 2010 సంవత్సరంలో రుణం పొందినట్లు తెలిపారు. రుణం తీసుకున్న నాటి నుండి నేటి వరకు రుణం పూర్తి స్థాయిలో చెల్లించలేదన్నారు. రాష్ట్ర సహకార సంఘాల చట్టం 1964 ప్రకారం సదరు రైతు వ్యవసాయ భూమిలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్లు వివరించారు. సదరు రైతుకు ఓటీఎస్ పథకంలో 1.70 లక్షల రూపాయలు మాఫీ వర్తిస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా వ్యవసాయ రుణాలు మాత్రమే మాఫీ అవుతాయిన వెల్లడించారు. దీర్ఘకాలిక రుణాలు పూర్తి స్థాయిలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీర్ఘ కాలిక రుణాలపై మాఫీ వర్తించదని స్పష్టం చేశారు. రైతులు ఓటీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోని ఈ నెల 30వ తేది లోగా రుణాలు చెల్లించాలని సూచించారు. విలేఖరుల సమావేశంలో డీజీఎం శ్రీనివాస్, ఏజీఎంలు యాదగిరి, నాగరాజు, రికవరి ఏజీఎం భూపాల్ రెడ్డితో పాటు స్థానిక బ్యాంకు మేనేజర్ కుమార స్వామి తదితరులు ఉన్నారు.

ఘోరరోడ్డు ప్రమాదం

- టీవీఎస్ ఎక్సెల్‌ను వేగంగా వచ్చి ఢీకొన్న కారు
- అక్కడికక్కడే ఇద్దరు మృత్యువాత





ఎక్సెల్‌ను ఢీకొని స్తంభాన్ని ఢీకొన్న కారు.. నుజ్జునుజ్జయిన ఎక్సెల్

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

జాతీయ రహదారి 161పై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. టీవీఎస్ ఎక్సెల్‌ను వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడేమృతిచెందిన ఘటన మండలంలోని బేగంపూర్ చౌరస్తా వద్ద జాతీయ రహదారి 161పై శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. శాంతాపూర్ గ్రామానికి చెందిన శివరాం (65) మాన్యాపూర్ గ్రామానికి చెందిన యాదుల్ (55) పిట్లం నుండి బిచ్కుంద వైపు టీవీఎస్ ఎక్సెల్‌ఐ వెళ్తుండగా హైదరాబాద్ నుండి నాందేడ్ వైపు వెళ్తున్న టయోటా ఫార్చునర్ కారు ద్విచక్ర వాహనాన్ని వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఇద్దరు వ్యక్తులు ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్ర వాహనం పూర్తిగా మంటల్లో ధ్వంసం అయింది. పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వగా పెద్దకొడప్‌గల్ ఎస్ఐ కోనారెడ్డి, బిచ్కుంద ఎస్సై మోహన్ రెడ్డి, పిట్లం ఎస్సై నీరేష్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. కుటుంబీకులకు సమాచారం అందజేశారు. మృతుడి కుమారుడు హైమద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి ఓర్వలేక విమర్శలు

- బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నాయకుల ఫైర్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చేస్తున్న అభివృద్ధి చూడలేక విమర్శలు చేస్తూ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, వాసు రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో లేని విధంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచడంతో ఇతర పార్టీ నాయకులు ఏమీ చేయాలో అర్థం కాక ఎమ్మెల్యే పై బురద జల్లుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకుల మాటలు విని ఎలాంటి ఆధారాలు లేకుండా ఒక పత్రిక మదన్మోహన్ పై అనవసరమైన వ్యాఖ్యలు రాయడంపై వారు మండిపడ్డారు. అసెంబ్లీ లోక్‌సభ ఎన్నికలలో ఓటమిపాలైన బిఆర్ఎస్ నాయకులకు ఏమి అర్థం కావడం లేదన్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొంది తన నెల జీతాన్ని కూడా కార్యకర్తల కొరకు అభివృద్ధి కొరకు కేటాయిస్తున్న ఎమ్మెల్యే పై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ఇకనుండి ఎమ్మెల్యే పై గానీ కాంగ్రెస్ పార్టీపై గాని అనవసర వ్యాఖ్యాలు చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, వాసు రెడ్డి, బోయిని విటల్, కోఆప్షన్ సభ్యుడు షాహిద్ పాషా, లక్ష్మణ్, నరసింహారెడ్డి , ఇమామ్, ఫారూఖ్ సాబ్, దివిటీ కిష్టయ్య, సాయ గౌడ్ తదితరులు ఉన్నారు.

ఈద్గా పరిసరాలు పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



ఈద్గాను పరిశీలిస్తున్న కార్యదర్శి, కోఆప్షన్ సభ్యులు

బక్రీద్ పండగ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో గల ఈద్గా పరిసరాలను పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య కో ఆప్షన్ సభ్యుడు షాహిద్ పాషా పరిశీలించారు. ఈద్గాపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి ఈద్గా కు వెళ్లేదారిలో గుంతలను పూడ్చి మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. బక్రీద్ పండగ సందర్భంగా నమాజ్ కు ఇబ్బందులు కాకుండా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. వారి వెంట ఫారూఖ్ సాబ్, బాసూమియా తదితరులు ఉన్నారు.

శ్రద్ధతో విధులు నిర్వర్తించి నిందితులకు శిక్షపడేలా చూడాలి

- నూతన నేర చట్టాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు, పోలీస్ అధికారులకు అవగాహన

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రతి పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన విధులను శ్రద్ధతో నిర్వహించి నూతన చట్టాలను అవలంభించి నిందితులకు శిక్ష పడేటట్లు కృషి చేయాలని డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య సూచించారు. కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె. నరసింహ రెడ్డి ఆద్వర్యంలో నూతన నేర చట్టాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి. వైజయంతి ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి లక్ష్మీ నరసయ్య నిజామాబాద్ , కామారెడ్డి జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో, కామారెడ్డి జిల్లా పోలీస్



శిక్షణకు హాజరైన పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు

అధికారులతో నేటి రోజున సమీక్ష నిర్వహించారు. 24 జూలై నుండి నూతన భారతీయ చట్టాల అమలు గురించి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ లక్ష్మీ నరసయ్య న్యాయ సలహాలు అందించారు. ఈ సమావేశంలో కొత్త చట్టాలైన (1) భారతీయ న్యాయ సన్నిహిత, (2) భారతీయ నాగరిక్ సురక్ష సన్నిహిత (3) భారతీయ సాక్ష్య అధినయం-2023. ఐపిసి, సిఆర్పిసి, ఐఈఏ (ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్) లో కీలక మార్పులు. ఇక పై ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ కు అధిక ప్రాముఖ్యత, ప్రతి ఒక్క పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు అధికారులు కొత్త చట్టాలపై క్లుప్తంగా వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు కొత్త చట్టాలను అవలంబించి నేరస్తులకు శిక్ష పడేటట్లు క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీపీలు అయిన బోసారపు రాజేష్ గౌడ్, అశోక్ శివరాం, నంద రమేష్, నిమ్మ దామోదర్ రెడ్డి, రాజేశ్వరి , సత్యనారాయణ, శేషు, మారికొందరు పీపీలు, డిఎస్పీలు నాగేశ్వరరావు, మదన్‌లాల్, ఇన్స్‌పెక్టర్‌లు ఎస్సైలు, పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించండి

- అధికారులను ఆదేశించిన మున్సిపల్ చైర్‌పర్సన్



పిచ్చిమొక్కలను చూపుతున్న ఇందుప్రియ

నవతెలంగాణ-కామారెడ్డి

కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అధికారులకు సూచించారు. తొమ్మిదో వార్డును శనివారం సందర్శించారు. ఈ సంద ర్భంగా కాలనీల్లో నెలకొన్న సమస్యలను స్థానికులు ఏకరువు పెట్టారు. కల్కీనగర్, ధోబీఘాట్ కాలనీల్లో రోడ్, డ్రైనేజ్, నీటి సమస్య వీధి దీపాల సమస్యలున్నట్టు స్థానికులు తెలిపారు. వెంటనే స్పందించి మున్సిపల్ అధికారులకు తొందరలో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలోని 9 వార్డ్ కౌన్సిలర్, సుగుణ, మున్సిపల్ అధికారులు, కాల్గీనగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లల్లోనే నాణ్యమైన విద్య

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/రామారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు ఎర్రమన్ను కుచ్చాలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ కృష్ణవేణి తో కలిసి వార్డ్ కౌన్సిలర్ అల్లం శ్రీను పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలను అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందిస్తారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి ప్రభుత్వ పాఠశాలలో బలోపేతానికి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు, కౌన్సిలర్

సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రమాదేవి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

రామారెడ్డి : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం స్థానిక ఎంపిటిసి తుపాకుల రజిత రాజేందర్ గౌడ్ విద్యార్థులకు ప్రభుత్వం పూర్తి సబ్సిడీపై అందిస్తున్న పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... బాలికలు ఉన్నంత పాఠశాల కార్పొరేట్ తరహాలో బిల్డింగ్ లో, ఉన్నంత విద్యావంతులైన ఉపాధ్యాయుల చే నాణ్యమైన విద్యను, ప్రభుత్వం అందిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి వినియోగించుకొని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని, ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురళి, ఎస్ఎంసి చైర్మన్ దేగల నాగలక్ష్మి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

గడి కోటలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

నవతెలంగాణ-దోమకొండ



అక్షరాభ్యాసం చేయిస్తున్న సుధాజ జాలియ

దోమకొండ మండల కేంద్రం లోని గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమానికి అపోలో సిఎస్ఆర్ మేనేజర్ సుధాజ జాలియా ప్రజా ప్రతిని ధులు హాజరైయ్యారు. 200 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. గడి కోట ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి కోసం పలు సేవా కార్యక్రమలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడికోట ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జి, సిడిపిఓ రోచిష్మా, అంగన్వాడి టీచర్లు, సూపర్వైజర్లు, గడికోట ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు 18 నుంచి స్పాట్ కౌన్సెలింగ్

- ఈ నెల 22 వరకు చివరి గడువు : గురుకుల ప్రిన్సిపాల్

నవతెలంగాణ-కామారెడ్డి

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈనెల 18 నుంచి 22 వరకు స్పాట్ కౌన్సిలింగ్ కోసం దరఖాస్తులను కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.ఆర్ అన్నపూర్ణ తెలిపారు. సరంపల్లి ఎక్స్ రోడ్ వద్ద గల గిరిజన సంక్షేమ గురుకుల పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్స రంలో ప్రవేశాల కోసం ఈ నెల 18 నుంచి 22 వరకు స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్టు ప్రిన్సిపాల్ డా. సి ఆర్ అన్నపూర్ణ శనివారం తెలిపారు. విద్యార్థులు స్పాట్ కౌన్సె లింగ్‌కు హాజరు కావాలని సూచించారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్, రెండు ఫోటోలు , ఆధార్ కార్డు నఖలు టిజియూజిసేట్ హాల్ టికెట్ లేదా ర్యాంక్ కార్డు లను తీసుకురావాలని, మరో రెండు జిరాక్స్ సెట్లు కూడా తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7901097707 నెంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు

ప్రతి సంవత్సరము గురుకుల విద్యార్థులకు వివిద రంగాల్లో ప్రావీణ్యం పొంది ప్రతిభ కనబరుస్తు న్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సంవత్సరంలో జరిగిన ఐఐటి జా మ్ పరీక్షలో కళాశాల విద్యా ర్థి నేనవత్ రాహుల్ ఐఐ టి



నేనావత్ రాహుల్(ఐఐటీ) దేవి వీరప్రసాద్ కాత్రోత్ వినోద్(నీట్)

హైదరాబాద్‌లో అర్హత సాధించినట్టు తెలిపారు. కాత్రోత్ వినోద్‌కు నీట్ వరంగల్‌లో సీట్ సాధించారని ప్రిన్సిపాల్ వివరించారు. గత సంవత్సరంలో దేవి వీరప్రసాద్ అనే విద్యార్థి సిపిజిఈటి 2023 మ్యాథమెటిక్స్ ఫస్ట్ ర్యాంక్ సాధించారని, నందకుమార్ సిపిజిఈటి 2023, జియాలజికల్ సిక్స్ ర్యాంక్ సాధించారన్నారు. అదే విధంగా పోలీస్ కానిస్టేబుల్స్‌గా, అగ్నిపథ్ జవాన్‌లుగా పలువురు విద్యార్థులు ఎంపికైనట్టు తెలిపారు. కళాశాలలో కోర్సులు బిఏ, బీకాం, ఎంపీసీఎస్, బి జెడ్ సి, ఈ కోర్సులతో పాటు ఎసిసి, ఎన్ఎస్ఎస్, క్రీడలు, లైబ్రరీ, వసతి గృహం లాంటి సౌకర్యాలు ఉన్నాయ న్నారు.





అగ్నిపథ్ స్కీమ్‌కు ఎంపికైన విద్యార్థులు.. కానిస్టేబుల్స్‌గా ఎంపికైన విద్యార్థులు

ఇంకా తెరుచుకోని ఖరగ్ పాఠశాల

- ఎంఈవోకు సమాచారం లేదట..
- గతేడాది సైతం మూడు నెలలు మూతే

నవతెలంగాణ-మద్నూర్

ఒక వైపు రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి బడుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటుంటే అందుకు విరుద్ధంగా విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తమ పరిధిలోని స్కూళ్లు తెరుచుకున్నాయా లేదా అని పరిశీలించే నాథుడే కరువైయ్యాడు. మారుమూల గ్రామాలను విస్మరిస్తుండటంతో అక్కడి పేద పిల్లలను విద్యకు దూరమయ్యే అవకాశం కనిపిస్తుంది.

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని మహారాష్ట్ర ప్రాంతానికి పూర్తిగా బార్డర్లో గల ఖరగ్ ప్రాథమిక పాఠశాల ఈసారి కూడా ఇంకా తెరుచుకోలేదు. గతేడాది సైతం మూడు నెలల వరకు మూసివేసి ఉండగా.. నవతెలంగాణలో కథనం ప్రచురించడంతో ఆగమేఘాల మీద ఉపాధ్యాయుడిని కేటాయించి పునఃప్రారంభింపజేశారు. అయితే ఈసారి సైతం అధికారులు అదే విధంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ పాఠశాలకు దిక్కు ఎవరు అనే చర్చలు వినబడు తున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు ఈ నెల 12న ప్రారంభమయ్యాయి కానీ ఖరగ్ పాఠశాల ఇంతవరకు ఓపెన్ కావడం లేక ఆ గ్రామ విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల వైపు మొగ్గు



తాళం వేసి ఉన్న స్కూల్

చూపుతున్నారు. గత ఏడాది కూడా పాఠశాలలు ప్రారంభోత్సవంలో ఈ పాఠశాల ప్రారంభానికి నోచుకోలేదు. గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు పంపవలసి వస్తుందని ఆ గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

గతేడాది అదే తీరు.. అయినా మారని వైనం

గత ఏడాది సైతం ఖరగ్ స్కూల్ విద్యాసంవత్సరం ప్రారంభమైనా మూడు నెలలవరకు తాళం తీసే దిక్కు లేకుండా పోయింది. నవతెలంగాణ ఆ గ్రామాన్ని విజిట్ చేసి కథనం ప్రచురించడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు ఆగమేఘాల మీద ఓ ఉపాధ్యాయుడిని కేటాయించారు. అయితే తాగా అదే విధంగా ఇంకా మూతపడి ఉండటం గమనార్హం. దీంతో విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం బడిబాట కార్యక్రమం చేపట్టిన ఖరగ్ పాఠశాల మూతబడి ఉండటం ఏమిటనే చర్చ ఆ గ్రామస్తులలో వ్యక్తమౌతుంది. అసలు విద్యాశాఖ ఈ మండలంలో పనిచేస్తుందా లేదా అని ఆవేదన గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యాధికారులపైన చట్టరీత్య చర్యలు తీసుకొని పాఠశాల చేర్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈ విషయం ఎంఈవోను ఆరా తీయగా.. స్కూల్ తెరుచుకోలేదనే సమాచారం కూడా తనకు తెలియనట్టు చెప్పడం గమనార్హం.

వచ్చే బుధవారం తెరుస్తాం

ఎంఈవో రాములు నాయక్

ఖరగ్ పాఠశాల తెరుచుకోకపో వడంపై ఎంఈవో రాములు నాయక్‌ను నవతెలంగాణ సంప్రదించింది. ఆ పాఠశాలకు డిప్యూటేషన్‌లో ఒక టీచర్ ఉన్నారని ఆయన ఎందుకు పోవడం లేదో ఇంతవరకు నా దృష్టికి రాలేదు. ఇప్పుడే తెలిసింది. ఒక టీచర్‌ను వచ్చే మంగళవారం లేదా బుధవారం పంపిస్తామని చెప్పడం కొసమెరుపు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
ఆదివారం | జూన్ 16, 2024 | www.navatelangana.com

అక్రమ ఇసుక డంపులు వేలం


వేలం పాటలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని పేపర్‌మిల్లు, కందకుర్తి గ్రామ శివారులో అక్రమ ఇసుక డంపులను సీజ్ చేయగా శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు తహసీల్దార్ శ్రావణ్ కుమార్ వేలంపాట వేయగా, 50 ఇసుక ట్రాక్టర్లకు గాను రూ.61,500కు ఇర్షన్ పటేల్ అనే వ్యక్తి దక్కించుకున్నారు. ఆదివారం సాయంత్రంలోపు ఈ వేలం పాటలు దక్కించుకున్న అక్రమ ఇసుకను వెంటనే తరలించాలని తహసీల్దార్ ఇర్షాన్‌కు సూచించారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి సర్వే

నవతెలంగాణ-ధర్పల్లి
మండలంలోని హొన్నాజీపేట్, సీతాయిపేట్, వాడి గ్రామాల్లోని ఇంటింటికి మిషన్ భగీరథ నీటి సరఫరాపై సర్వే నిర్వహించినట్లు ఎంపిడిఓ బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. ఆయా గ్రామాల్లోని ఎన్ని కుటుంబాలకు నీటి సరఫరా జరుగుతున్నదనే దానిపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో భగీరథ నీటి సరఫరా ఎన్ని ఇండ్లకు అందుతుందనే వివరాలు తమ పంచాయతీ సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారని, ఆయా గ్రామాల ప్రజలు తమ సిబ్బందికి సహకరించి వివరాలు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఓ రాజేష్, ఆయా గ్రామాల కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కందకుర్తిలో పేకాట స్థావరంపై దాడి

- రూ.23,620 నగదు స్వాధీనం, కేసు నమోదు

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని కందకుర్తి గ్రామ శివారులోని ఓ చేనులో పేకాటాడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.23,620 నగదును స్వాధీనం చేసుకున్నట్లు రెంజల్ ఎస్సై ఈ.సాయన్న తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమించే ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్
ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించే ప్రైవేటు పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బోధన్ పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమాజంలో బోధన్ డివిజన్ అధ్యక్షులు నగేష్ మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్ యజమాన్యం విద్యార్థులకు బుక్స్, షూస్, యూనిఫామ్ అమ్మకూడదని ప్రభుత్వం హెచ్చరించినా.. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఈ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ అలాగే విద్యార్థులకు అధిక ధరలకు షూస్, బుక్స్, యూనిఫామ్ అమ్మడం వంటివి చేస్తున్న పాఠశాలలను సీజ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని యెడల పాఠశాలలో నోట్‌బుక్స్ పట్టుబడితే విద్యార్థి సంఘం తరపున బీద విద్యార్థులకు పుస్తకాలను పంచిపెట్టే కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. కావున ఎంఈఓ స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివ, మజీద్, విగ్నేష్ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

సాటాపూర్ సంతలో పశువుల క్రయవిక్రయాలు పరిశీలన


పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని సాటాపూర్ సంత ప్రతి శనివారం జరుగుతుండడంతో, సోమవారం బక్రీద్ పండుగను పురస్కరించుకొని క్రయవిక్రయాలు ఊపందుకున్నాయి. ఈ సంతలో గోవులను విక్రయించకుండా ఉండేందుకు గానూ ఎస్ఐ సాయన్న పోలీసు బందోబస్తుతో వెళ్లి పశువుల సంతను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని ముస్లింలకు ఆయన సూచించారు. ఈ సంతలో గోవుల క్రయవిక్రయాలు జరపకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేషనల్ డి వార్మింగ్‌డేపై అవగాహనా సదస్సు


నేషనల్ డి వార్మింగ్‌డేపైన అవగాహనా కల్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్
ఈనెల 20న నేషనల్ డి వార్మింగ్ డే సందర్భంగా అందులో భాగంగా స్థానిక నర్సులు, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలకు శనివారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అందరికీ ఆల్బెండజోల్ టాబ్లెట్‌ను ఎలా వేయాలి?, ఏ వయసు వారికి ఏడోస్ వేయాలో అవగాహన కల్పించారు. 1 సంవత్సరం మొదలుకొని 19 సంవత్సరాల వరకు ప్రతి అంగన్వాడి సెంటర్ ప్రభుత్వ పాఠశాల, కాలేజీలలో కూడా ఈ ఆల్బెండజోల్ వేయించాలని అన్నారు. సీజన్ వ్యాధుల గురించి, డెంగ్యూ వ్యాధి గురించి ఈనెల యాంటీ మలేరియా మంత్‌ను గూర్చి అందరికీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రమేష్, డాక్టర్ అయేషా ఫాతిమా, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, బట్టు, నర్సులు అనురాధ, రాజవ్వ, విజయ, కమల, అంగన్వాడీ కార్యకర్తలు, స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ వారసత్వాన్ని కొనసాగిద్దాం

- అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి దాస్

నవతెలంగాణ-ఆర్మూర్
విప్లవ కవి శ్రీశ్రీ స్ఫూర్తితో సామాజిక మార్పు కోసం కావ్యాలను రాస్తూ, కంచు కంఠాలతోగళమెత్తి, శ్రీశ్రీ వారసత్వాన్ని కొనసాగిద్దామని అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి దాస్ కవులు, కళాకారులకు పిలుపునిచ్చారు. శ్రీశ్రీ 41వ స్మారక సభను పట్టణంలో అరుణోదయ జిల్లా అధ్యక్షులు వి.సూరిబాబు అధ్యక్షతన ఐఎఫ్‌టీయూ ఆఫీసులో నిర్వహించారు. ఈ సభలో దాసు పాల్గొని మాట్లాడుతూ.. శ్రీశ్రీ కవిత్వం సామాజిక మార్పునకు మార్గాన్ని సుగమం చేసిందని ఆయన తెలిపారు. శ్రమ సౌందర్యం గొప్పదనాన్ని కవిత్వం, పాటల ప్రపంచానికి తెలిపిన ప్రజాకవి శ్రీశ్రీ అని ఆయన కొనియాడారు. 'కుదిరితే పరిగెత్తు. లేకపోతే నడువు. అది కూడా చేతకాకపోతే పాకుతూ పో. ఒకచోట అలా కదలకుండా ఉండిపోకు, 'ఉద్యోగం రాలేదని.. వ్యాపారం దెబ్బతిన్నదని.. స్నేహితులు మోసం చేశారని.. ప్రేమించిన వారు వదిలి వెళ్లిపోయారని అలా ఉండిపోతే ఎలా?". "సృష్టిలో చలనం ఉన్నది ఏది ఆగి పోకూడదు. కనుక మనిషి నిరాశ నిస్పృహలతో ఆగిపోకుండా నిత్యం శ్రమించాలి" అని శ్రీశ్రీ బోధించారని ఆయన అన్నారు. 'కన్నీళ్లు కారిస్తే కాదు. చెమట చుక్కలు చిందిస్తేనే చరిత్ర రాయగలమని తెలుసుకో" అనే విషయాన్ని మనకు గుర్తు చేశారు. ఈ పుడమి మీద అనేక రకాల జీవులు జీవిస్తున్నాయని, మనిషి జీవితానికి ఒక సార్థకత ఉందని అందుకే నేటి ప్రపంచంలో మన కర్తవ్యాలను నిర్దేశించుకోవాలని ఆయన సూచిస్తూ అనేక రచనలు చేశారని దాసు యాది చేశారు. 'మనది ఒక బతుకేనా కుక్కల వలె, నక్కల వలె.. మనది ఒక బతుకేనా సందులలో పందులవలె" అంటూ సమాజాన్ని అర్థం చేసుకొని ఆలోచించే సామర్థ్యం కలిగిన మనం మంచి చెడులను విశ్లేషించుకొని ముందుకు సాగాలని శ్రీశ్రీ వెన్ను తట్టాడని ఆయన తెలిపారు. తెలుగు కవిత్వంలో విప్లవాత్మక మార్పు తెచ్చిన శ్రీశ్రీని ఇందిరాగాంధీ నిర్బంధించినా, కవిత్వానికి సంకెళ్లు విధించాలని ప్రయత్నించినా, ఛేదించి, శ్రామిక జనపక్షాన నిలిచిన శ్రీశ్రీ ప్రజాకవులకు, కళాకారులకు ఆదర్శమని దాసు కొనియాడారు." పాడవోయి భారతీయుడా ఆడి పాడవోయి విజయ గీతిక' అంటూ వెన్ను తిట్టాడని దేశ పౌరుడి బాధ్యతలను గుర్తు చేశారని దాసు అన్నారు. ఇబ్బందులను ఎదుర్కొని, అవహేళనలను అధిగమించి, ప్రజా కవిగా చరిత్రలో నిలిచిపోయారని దాసు తెలిపారు.


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఈ స్మారక సభలో అరుణోదయ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, అబ్దుల్, వివిధ ప్రజాసంఘాల నాయకులు శివాజీ, బాలయ్య, బి.ప్రిన్స్, ఎస్.వెంకటేష్, వర్ధారెడ్డి, చిట్టక్క, ధనలక్ష్మి, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి అనుమతి

- నవతెలంగాణ కథనానికి స్పందన
- బాధితులకు ఊరట

నవతెలంగాణ-ధర్పల్లి
మండలంలోని ఓ గ్రామకార్యదర్శి అదేగ్రామంలో నూతన ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న ఓ బాధితునికి గత నెలరోజులుగా అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీంతో బాధితులు తమ గోడును నవతెలంగాణకు వెలిబుచ్చడంతో గ్రామ కార్యదర్శుల ఇష్టారాజ్యం అనే శీర్షికన నవతెలంగాణ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన సంబంధిత పంచాయతీ కార్యదర్శి బాధితులకు పిలిచి ఒకే రోజులో అనుమతులు అందించారు. దీంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

అలాగే మండలంలోని మరికొన్ని గ్రామాల్లో కొందరు అధికారులు తమ అహంకార ధోరణి మార్చుకొని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చెయ్యాలని ప్రజలు కోరుతున్నారు. కొందరు మితిమీరిన అహంకారం, మండల అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో మరీ రెచ్చిపోతున్నారనే ఆరోపణలున్నాయి. కొందరికి కార్యదర్శి అనే కొలువు కాలక్షేపంగా మారిందని ఆయాగ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండకుండా మండల కార్యాలయంలో పని ఉందని బుకాయిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండకుండా తిరుగుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

ముప్కాల్ గ్రామపంచాయతీ సెక్రటరీపై సస్పెన్షన్ వేటు

నవతెలంగాణ-ముప్కాల్
ముప్కాల్ గ్రామపంచాయతీ సెక్రటరీ విజయ్ కుమార్ పై సస్పెన్షన్ వేటు వేసినట్లు మండల అభివృద్ధి అధికారి మహమ్మద్ ముజాఫరోద్దీన్ శనివారం తెలిపారు. గ్రామపంచాయతీ పనుల పట్ల అలసత్వం వహిస్తూ ఇష్టానుసారంగా అనుమతులను ఇవ్వడంతో జిల్లా కలెక్టర్ ముప్కాల్ గ్రామపంచాయతీ సెక్రటరీ విజయ్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు వేశారని పేర్కొన్నారు.

తహసీల్దార్ ఎదుట ఇద్దరి బైండోవర్


తహసీల్దార్ ముందు బైండోవర్ చేసిన పోలీసులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
మండలంలోని గన్యాతాండ గ్రామపంచాయతీ పరిధిలో నర్సింగ్‌తాండలోని ఇద్దరిని పోలీసులు శనివారం తహసీల్దార్ ముందర బైండోవర్ చేశారు. ఇంటి పక్క వారితో అల్లర్లకు పాల్పడుతున్న వ్యక్తులకు బైండోవర్ చేసి రెండు లక్షల జరిమానా ఉంటుందని హెచ్చరించారు.

ఏకరూప దుస్తులు అందజేత


విద్యార్థులకు దుస్తులు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
మండలంలోని అర్గుల్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఎంపీటీసీ వనిత ఏకరూప దుస్తులను అందజేశారు. ప్రభుత్వం ద్వారా వచ్చిన దుస్తులను ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ ఏకరూప దుస్తులు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కన్వీనర్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ జైడి వనిత శనివారం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులున్నారు.

నియామక ఉత్తర్వులు ఇప్పించాలని వినతి


వినతిని అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-భీమ్‌గల్
61 ఏండ్లు పైబడిన వీఆర్ఏ వారసులకు త్వరితగతిన నియామక ఉత్తర్వులు ఇప్పించాలని ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. శనివారం భీంగల్ వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం వీఆర్ఏలను రెగ్యులర్ చేయడంతో పాటు కారుణ్య నియామకాల కొరకు జీవో నెంబర్ 81, 85 ప్రకారం 3,797 మంది 61 ఏండ్లు పైబడిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. కానీ ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేకపోవడంతో నిర్ణయం అలాగే ఉందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో వీఆర్ఏ వారసులకు కారుణ్య నియామకాల కొరకు ఉత్తర్వులు ఇప్పించి 3797 వీఆర్ఏ కుటుంబాలను ఆదుకోవాలని ఎమ్మెల్సీని కోరారు.

జాతీయ చేనేత పద్మశాలి సమైక్య జిల్లా ముఖ్య కార్యదర్శిగా మామిడి విట్టల్

నవతెలంగాణ-ధర్పల్లి
జాతీయ చేనేత పద్మశాలి సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా మామిడి విట్టల్ నియమితులయ్యారు. నియామకపత్రాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాముని సుదర్శన్ నేత విఠల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, చేనేత పద్మ సమైక్య అధ్యక్షులు కొండా రామ మోహన్ నేత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాముని సుదర్శన్ నేత, రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు చింతల శంకర్ నేత చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మామిడి విట్టల్ మాట్లాడుతూ.. తనపై తన కుల బాంధవులు ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతగల పదవిని అందించారని, వారినమ్మకాన్ని వమ్ము చేయకుండా, సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యకమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామన్ సుదర్శన్, నేత రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు చింతల శంకర్ నేత, సాయిలు, పవన్, సంగన్న తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రాన్ని అందుకుంటున్న విట్టల్

తేనె టీగల దాడి.. తృటిలో తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-మాక్లూర్
మండలంలోని దాస్‌నగర్ సమీపంలో గల మహాత్మాగాంధీ జ్యోతిభాపూలే సాంఘిక మహిళ గురుకుల పాఠశాల, కళాశాల వద్ద తేనె టీగలు ఒక్కసారిగా స్థానికులపై శనివారం దాడిచేశాయి. నూతనంగా స్కూల్‌లో అడ్మిషన్ చేసేందుకు వచ్చిన వారిపై దాడిచేశాయి. తృటిలో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

తేనె టీగలు తెట్టె తొలగించడంలో అలసత్వం..

గత రెండు నెలలుగా పాఠశాలలకు వేసవి సెలవులు ఉన్న విషయం తెలిసిందే. పాఠశాలకు ఆనుకుని ఉన్న తేనెటీగల తెట్టెలను తొలగించడంలో పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వహించారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.


తేనేటీగల తొట్టి


కేజీబీవీలో పరిసరాలను పరిశీలిస్తున్న డిఎల్‌పిఓ శివరామకృష్ణ

కేజీబీవీలో.. పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు

- కస్తూర్బాను సందర్శించిన డిఎల్‌పిఓ శివరామకృష్ణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేజీబీవీ విద్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఒకరు శుక్రవారం సాయంత్రం పాము కాటుకు గురైనట్లు ఆలస్యంగా తెలిసింది. ఈ విషయాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శి శాంతికుమార్‌కు ప్రిన్సిపాల్ గంగామణి శనివారం సమాచారం ఇవ్వడంతో స్పందించిన ఆయన వెంటనే గ్రామ పంచాయతీ సిబ్బందితో కస్తూర్బాగాంధీ విద్యాలయంలో పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించారు. విద్యాలయంలో సిబ్బంది ఒకరు పాముకాటుకు గురైన సమాచారం తెలిసి ఆర్మూర్ డివిజనల్ పంచాయతీ అధికారి శివరామకృష్ణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి చింత రాజ శ్రీనివాస్ కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించారు. పాముకాటుకు గురైన సిబ్బంది చికిత్స పొందుతుందని, ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ప్రత్యేక అధికారిణి గంగామణి తెలిపారు.

ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క జన్మదిన సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల మధ్య కేక్ కటింగ్ నిర్వహి ంచారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, వాసురెడ్డి, బాయిని విఠల్, లక్ష్మణ్, షాహిద్‌పాషా, ఇమామ్, శేఖర్, ఫారూఖ్‌సాబ్, నరసింహారెడ్డి, దివిటి కిష్టయ్య, హనుమాన్లు, సాయ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, భాషఉమియా, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి తినిపిస్తున్న నాయకులు

రుణాలు మంజూరు చేయాలని వినతి

నవతెలంగాణ-నవీపేట్

తెలంగాణ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రైతులకు రుణ సౌకర్యం కల్పించాలని మండల కేంద్రంలోని కోపరేటివ్ బ్యాంక్ అధికారికి శనివారం వినతిపత్రం అందించారు. రైతులకు వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్నందున బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని ఏఐకేఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్ సింగ్, నాయకులు కిషన్ పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

24 గంటల్లోగా టెస్ట్ రిపోర్టులివ్వాలి

- **జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్**
- **టీ హబ్, సఖి సెంటర్ల ఆకస్మిక తనిఖీ**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

24 గంటల్లోగా పేషెంట్‌కు సంబంధించిన టెస్ట్ రిపోర్టులు చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ సిబ్బందికి, ల్యాబ్ టెక్నీషియన్లకు సూచించారు. టీ హబ్, సఖి సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్, పాలియేటివ్ కేర్ సెంటర్, సఖి సెంటర్ అనాథల ఆశ్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ అందిస్తున్న సేవలను పర్యవేక్షించారు. తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌లో డెంగ్యూ పరీక్ష ఎన్ఎస్ 1 స్ట్రిప్స్ 223 అందుబాటులో ఉన్నాయన్నారు. మిగతా పరీక్షలకు సంబంధించి ఎన్ని కెమికల్స్ స్టాక్ ఉన్నాయని, రానున్న కాలానికి సీజనల్ వ్యాధుల ప్రబలే అవకాశం ఉన్నందున సరిపడా లాజిస్టిక్స్ కోసం ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాల్సిందని సూచించారు. రికార్డులను రిపోర్టులను పరిశీలించారు. అదేవిధంగా ట్యాల్టివ్ కేర్ కేంద్రాన్ని సందర్శించగా అక్కడ డాక్టర్ చైతన్యకుమార్ అందుబాటులో లేనందున అడిగి తెలుసుకున్నారు.

ఇన్ పేషెంట్లు, కొత్తగా రోగులు ఎవరూ రానందున క్షేత్రస్థాయి నుంచి ఇన్‌పేషెంట్లు వచ్చేలాగా చూడాలని సమయపాలన పాటించాలని హెచ్చరించారు. అదేవిధంగా సఖీ సెంటర్లలో సిబ్బంది ప్రతిరోజూ సమయానికి వచ్చి సమయపాలన పాటించాలని అక్కడి సిబ్బందికి తెలిపారు. పక్కనే ఉన్న అనాథల ఓపెన్ సెంటర్లో ఉండేవారికి తగిన సమయంలో వైద్య సౌకర్యాలు అందిస్తూ చికిత్సను సమయానికి ఇవ్వాలని, ఆరోగ్యంగా ఉండేలా చూడాలని అన్నారు. గాలి ధారాళంగా వచ్చేలాగా చూడాలని, ప్రస్తుతమున్న ఏడుగురు అనాథలను వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి



పరికరాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

- **కామారెడ్డి డిఎస్పి నాగేశ్వరరావు**



మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరావు

నవతెలంగాణ-కామారెడ్డి/రామారెడ్డి

కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో కామారెడ్డి డిఎస్పి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బక్రీద్ పండగను పురస్కరించుకొని శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మున్సిపాలిటీ నుంచి సానిటేషన్ సక్రమంగా జరిగే విధంగా చూస్తామని తెలిపారు. ఏ వ్యక్తి కూడా చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదని, ఏదైనా సమాచారాన్ని తప్పనిసరిగా పోలీసు వారికి తెలియజేసి, తదుపరి విచారణ కొరకై అప్పగించవలసి ఉంటుందని, లేనియెడల చట్ట ప్రకారంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో పట్టణానికి చెందిన అన్ని మతాలకు చెందిన మతపెద్దలు, మున్సిపాలిటీ అధికారులు, పోలీస్ సిబ్బంది, ఎస్ఐ లు పాల్గొన్నారు.

పండగను శాంతియుతంగా చేసుకోవాలి : ఏఎస్ఐ రవీందర్



రామారెడ్డి : మాట్లాడుతున్న ఏఎస్ఐ రవీందర్

రామారెడ్డి : ముస్లింలు బక్రీద్ పండుగను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని శనివారం ఏఎస్ఐ రవీందర్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ... పండగను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతియుతంగా జరుపుకోవాలని, సూచించారు. కార్యక్రమంలో ముస్లిం, హిందూ మత పెద్దలు పాల్గొన్నారు.

రైతుల పేరిట రాజకీయం చేస్తే సహించబోం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ రైతుల పేరుతో రాజకీయం చేస్తే సహించే ప్రసక్తి లేదని లింగంపేట్ మండలం కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. శనివారం లింగంపేట్ మండలం కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ మాట్లాడారు. పోల్కంపేట్ గ్రామానికి చెందిన రైతు పంట పొలంలో ఎన్‌డిసిసిబి అధికారులు దీర్ఘకాలిక రుణాలు చెల్లించాలని జెండాలు ఫ్లెక్సీలు పెడితే మాజీ శాసనసభ్యులు శుక్రవారం ఎన్ డిసిసిబి బ్యాంకు ముందు రైతులతో ధర్నా చేయడం సిగ్గ చేటు అన్నారు. పది సంవత్సరాలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బి ఆర్ ఎస్ ప్రభుత్వం రైతులకు రిబేట్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్ర సమయంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి రైతులకు నేరుగా రిబేట్ ఇచ్చినట్టు తెలిపారు. బ్యాంకులో దీర్ఘకాలిక రుణం తీసుకున్నప్పటికి రుణం చెల్లించకుంటే బ్యాంకు సిబ్బంది రైతు పంట పొలంలో ఫ్లెక్సీలు జెండాలు కడితే కాంగ్రెస్ ప్రభుత్వం పై బి ఆర్ ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే నిందలు వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత ఐదు సంవత్సరాలుగా ఎల్లారెడ్డి శాసనసభ్యుగా ఉండి రైతులకు చేసింది ఏం లేదన్నారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని విమర్శించారు. బి ఆర్ ఎస్ పార్టీ లక్ష రూపాయల రుణమాఫీ ఇప్పటికీ మాఫీ చేయలేదని అందుకనే ప్రజలు ఎన్నికల్లో గుణపాఠం చెప్పారన్నారు. రైతుల పేరుతో రాజకీయం చేయడం మానుకోవాలని వారు మాజీ ఎమ్మెల్యేగా సూచించారు నిజా నిజాలు తెలుసుకోకుండా కాంగ్రెస్ పార్టీపై నిందలు వేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు వంజరి ఎల్లమ్మయ్య, మండల యూత్ అధ్యక్షులు సుప్పాల రాజు, మండల కాంగ్రెస్ నాయకులు మాసుల కృష్ణమూర్తి, పతియోద్దీన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్థంతి నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని డోన్గాం గ్రామంలో మాజీ ఎమ్మలే హన్మంత్ షిండే సొంత ఊరిలో తండ్రి మాదప్పా వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి శనివారం నివాళి అర్పించారు. తండ్రి జ్ఞాపకార్థం గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తమ్ముడు గంగారాం షిండే, హరీష్ షిండే, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు ఘనంగా సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండలం లోని ఆయా గ్రామాలకు చెందిన రక్తదాతలకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్కే డిగ్రీ కళాశాల లో రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కామారెడ్డి జిల్లాలోని ఆర్కే డిగ్రీ కళాశాలలో కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 50 సార్లు రక్తదానం చేసినందుకు కామారెడ్డిజిల్లా మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షులు రాజన్న చేతుల మీదుగా బెస్ట్ డోనర్ అవార్డు ను లింగంపేట్ మండల రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు బొల్లు శ్రీకాంత్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామ అంగన్వాడీ సెంటర్ 3 నందు శనివారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సిడిపిఓ భార్గవి ఆదేశానుసారం పిప్రి సెక్టర్ పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు, గర్భిణీ స్త్రీలకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ తెలిపారు.

భూమి సర్వే అడ్డగింత

- **రెవెన్యూఅధికారులను, పోలీసులను అడ్డుకున్న వైనం**

నవతెలంగాణ-ధర్పల్లి

భూమిని సర్వే చేయకుండా రెవెన్యూ, పోలీసు అధికారులను అడ్డగించారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని మద్దుల్ అటవీ ప్రాంతంలో ప్రభుత్వ అసైన్డ్ భూమి సర్వేనెంబర్ 1160లో సీతాయిపేట్ గ్రామానికి చెందిన లొక్కిడి నర్సుకు మూడున్నర ఎకరాల భూమి ఉంది. దానిని సర్వే నిర్వహించాలని దరఖాస్తు చేసుకోగా.. స్పందించిన రెవెన్యూ అధికారులు దరఖాస్తుదారుల నుంచి ఆ భూమికి సంబందించిన పూర్తి దస్తావేజులు పరిశీలించి, పక్కనే ఉన్న రైతులను చట్టం ప్రకారం నోటీసులు జారీచేసేందుకు పక్కవారి ఇండ్లలోకి వెళ్ళితే సహకరించలేదు. నోటీసులను తీసుకునేందుకు నిరాకరించారు. బాధితులు పోలీసుల సహకారం, రెవెన్యూ అధికారుల సహకారంతో సంబంధిత రైతుల ఇండ్లకు నోటీసులు అంటించారు. నోటీసుల్లో పొందుపర్చిన సమయానుసారం శుక్రవారం పోలీసుల బందోబస్తుతో, రెవెన్యూ సర్వేయర్, ఇతర సిబ్బంది సర్వే నిర్వహించేందుకు వెళ్లగా పక్క భూమి వారు సభవత్ మంగీలాల్, సభవత్ నరేందర్ సర్వేకు వచ్చిన అధికారులపై దురుసుగా ప్రవర్తించారు. సర్వేను అడ్డుకున్నారు. సుమారు గత 50 సంవత్సరాల నుంచి తన భర్త ఈ మూడన్నర ఎకరాల్లో పంట పండించాడని, ఇప్పుడు తమ భూమిని పక్కనున్న వారు ఖబ్జా చేశారనే అనుమానంతో తమకు ఉన్న సర్వేనంబర్ 1160/1/11/2లో పొడి అయిన భూమి మూడున్నర ఎకరాలకు రెవెన్యూ అధికారులకు సర్వేకు దరఖాస్తు పెట్టుకున్నామని, దాన్ని పక్కనున్న వారు సర్వే చేయనీయకుండా అడ్డుకుంటున్నారని బాధితులు కంటతడి పెట్టారు. సర్వే చేయనీయకుండా అడ్డుకోవడంతో అధికారులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వెనుదిరిగారు.



సర్వేను అడ్డుకుంటున్న పలువురు

పడంపల్లిలో బడిబాట



బడిబాటలో పాల్గొన్న టీచర్లు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పడంపల్లి గ్రామములోని ప్రభుత్వ ఎంపీయూపీఎస్ పాఠశాలలో హెచ్ఎం లాలయ్య అధ్వర్యంలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎడ్గి హెచ్ఎం తిరుపతయ్య, ఉపాద్యాయుడు హీరాజాదవ్ అథితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం లాలయ్య మాట్లాడుతూ ఒకటవ తరగతి విద్యార్థులకు అక్షరభ్యాసం తల్లిదండ్రులతో కలిసి చేయించామని అన్నారు. ఇద్దరు పిల్లలకు అంగన్‌వాడీ నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్టు తెలిపారు. అదేవిధంగా పడంపల్లి లో 7వ తరగతి పూర్తి చేసిన ఒక విద్యార్థికి పెద్ద ఎడ్గి జడ్పీహెచ్ఎస్‌లో ఎనమిదవ తరగతిలోకి అడ్మిషన్‌ను ఆ స్కూల్ హెచ్ఎం హెచ్ఎం తిరుపతయ్య, ఉపాద్యాయుడు హీరా జాదవ్ సమక్షంలో ప్రవేశం కల్పించారు. ఖాళీగా ఉన్న పిల్లలకు తప్పక పాఠశాలకు పంపాలని అన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీగా ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలకు ప్రభుత్వ బడులకు పంపించాలని, అదేవిధంగా పుస్తకాలు, యూనిఫాంలు, రుచికరమైన మధ్యాహ్న భోజనం ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు.

మున్సిపల్ కార్యాలయ బిల్ కలెక్టర్లకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ కార్యాలయంలో శనివారం బిల్ కలెక్టర్లను సన్మానించారు. ఈ సంవత్సరం అనుకున్న టార్గెట్ సాధించినందుకు వారి శ్రమను గుర్తించి సన్మానించామని మున్సిపల్ చైర్‌పర్సన్ అయ్యప్ప శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రాజు సన్మానించి అభినందించారు. రానున్న కాలంలో మున్సిపల్ అభివద్ధికి మరింత కషి చేయాలని ఆకాంక్షించారు.



స్కూల్ బస్సులకు అనుభవజ్ఞులైన డ్రైవర్లుగా నియమించుకోవాలి

- **ఆర్మూర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానంద రెడ్డి**

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

స్కూల్ బస్సులకు అనుభవజ్ఞులనే డ్రైవర్లుగా పెట్టుకోవాలని ఆర్మూర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోణి ఉషా జ్యోతి ఉన్నత పాఠశాలలో శనివారం ఆర్మూర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో ప్రైవేట్ స్కూల్ బస్సులు నడిపించే డ్రైవర్లకు, హెల్పర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎంవీఐ వివేకానంద రెడ్డి మాట్లాడుతూ.. స్కూల్ బస్సులకు అనుభవం ఉన్న వారినే డ్రైవర్లుగా పెట్టుకోవాలన్నారు. చిన్నపిల్లలు ఉంటారు కాబట్టి డ్రైవర్లు కూడా బస్సులను జాగ్రత్తగా నడపాలని సూచించారు. బస్సు నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదని, ఇండికేటర్లు, లైట్లు సరిగా పనిచేస్తున్నాయో లేదో చూసుకోవాలన్నారు.

ఈ సందర్భంగా మోటార్ వెహికల్ చట్టంపై అవగాహన కల్పించారు. అంతకుముందు ఆయన ప్రైవేట్ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రైవేట్ స్కూల్ యాజమానులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెహికిల్ ఇన్‌స్పెక్టర్

కుక్కల దాడిలో మహిళకు గాయాలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డి పేట మండల కేంద్రంలో కుక్క దాడి చేయడంతో మహిళలకు గాయాలైన సంఘటన శనివారం రోజు చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘన్పూర్ మండలం బూరుపల్లికి చెందిన బుజ్జమ్మ బురుపల్లి నుండి నాగిరెడ్డిపేట్ మండల కేంద్రానికి ఆటోలో వచ్చారు. బస్టాండ్ ప్రాంతంలో ఆటో దిగుతుండగా వెనుక నుండి కుక్క వచ్చి దాడి చేసింది. కుక్క దాడి చేయడంతో మహిళకు కాలికి గాయాలయ్యాయి వెంటనే మండల స్థానికులు మహిళను కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి చికిత్సలు చేయించారు. ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో సుభాష్ చంద్రబోస్ వీధిలో పొల అనే వ్యక్తికి కుక్క దాడి చేయడంతో గాయాలయ్యాయి.



తరచూ కుక్కల దాడి..

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో పాటు ఆయా గ్రామాల్లోపల తరచూ కుక్కల దాడులు కొనసాగుతున్నాయి. చిన్నపిల్లపై పెద్దలపై కుక్కలు దాడి చేస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రంలో ప్రధాన రదారిపై కుక్కలు గుంపులు గుంపులుగా తిరగడంతో ఇంటి నుండి బయటకు రావడానికి పిల్లలు పెద్దలు జంకుతున్నారు. మండల కేంద్రంలో వాహనాలకు కుక్కలు అడ్డం రావడంతో ఎన్నోసార్లు ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాల పాయలయ్యారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గ సమస్యలపై అధికారులను కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి శనివారం ముఖ్యమంత్రి ఓఎస్‌డి అజిత్ రెడ్డి, అడిషనల్ సెక్రెటరీ సంగీత సత్యనారాయణను సెక్రెటేరియట్‌లో కలిసి నియోజకవర్గ సమస్యలపై వివరించారు. ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూలు, పదివేల ఇళ్ల గురించి, పెండింగ్‌లో ఉన్న సీఎం రిలీఫ్ ఫండ్‌పై చర్చించారు. అధికారులు సానుకూలంగా స్పందించినట్టు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

